సాక్షి ఒడిశా
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,68,605లు, బంగారం 100 మిల్లీగ్రాములు, వెండి 17 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వేడుకగా ఉత్కళ దివాస్

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అన్ని ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు.

- 8లో



ఇఫ్తార్	సెహరి
మంగళ	బుధ
6.07	4.24

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

గజేంద్రుడు మృతి



ఏనుగు మృతదేహం

బరంపురం: గంజాం జిల్లా బంజనగర్ అటవీ రేంజ్ ఉత్తర ఘుమసర అటవీ ప్రాంతం, గాలరి పంచాయతీ పనడా గ్రామంలో మగ ఏనుగు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. దీంతో అటవీ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. గుముసరా డివిజన్ అటవీ అధికారులు ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకొని కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పశు వైద్యుల సాయంతో పోస్టుమార్టం నిర్వహించి గుముసరా అడవిలో పాతిపెట్టారు. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘాట్ రోడ్డులో ట్రక్కు బోల్తా



ఘాట్ రోడ్డులో బోల్తాపడిన ట్రక్కు

జయపురం: జయపురం – కొరాపుట్ 26వ జాతీయ రహదారి ఘాట్ రోడ్డులో సోమవారం ఉదయం ఒక ట్రక్కు బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణహానీ జరుగలేదు. ట్రక్కు డ్రైవర్ స్వల్ప గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ప్రమాదం వలన జాతీయ రహదారికి ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. విజయనగరం నుంచి నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్‌కు వెళ్తున్న ఆ ట్రక్కు అదుపు తప్పి బోల్తా పడినట్లు బరిణిపుట్ పోలీసు పంటి అధికారి వెల్లడించారు. భారతమాల గ్రీన్ కారిడార్ నిర్మాణం కోసం జేసీబీ తీసుకెళ్తుండగా మలుపు వద్ద ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న బరిణిపుట్ పోలీసు అధికారి కామాక్ష ప్రసాద్ బిశాయి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన డ్రైవర్‌ను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో ఇటువంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయని, ప్రమాదాలు అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉగాదికి వివిధ పోటీల నిర్వహణ

రాయగడ: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ వివిధ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. ఈనెల 3వ తేదీన స్థానిక తేజస్వీ హోటల్ మైదానంలో శ్లోకాలు, వేదస్ అనే అంశంపై పోటీలను నిర్వహిస్తారు. అదేవిధంగా 4వ తేదీన రంగోలీ పోటీలు, 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు మెహందీ, 6 గంటలకు అంత్యాక్షరి, 6వ తేదీన 15 ఏళ్ల చిన్నారుల మధ్య బెస్ట్ ఆఫ్ వేస్ట్ సాయంత్రం 4 గంటలకు, అలాగే సాయంత్రం 6 గంటల నుంచి 35 ఏళ్ల పైబడిన మహిళల మధ్య సాంప్రదాయ వస్త్రాధరణ పోటీలు, 7వ తేదీన ఉదయం 9 గంటలకు 12 ఏళ్లలోపు చిన్నారుల మధ్య సాంప్రదాయ దుస్తుల వేషాధారణ, సాయంత్రం 4.30 గంటల నుంచి వంటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

అడవి జంతువు మాంసం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



అరెస్టైన మాధవ్ చలాన్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి అటవీ శాఖకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు అడవి జంతువు మాంసం అమ్ముతున్న మాధవ్ చలాన్ (64) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మాంసం స్వాధీనం చేసుకున్న పోలీసులు అది హిస్రిక్ ఇండికా మాంసంగా గుర్తించారు ఇది సుమారు 9 కేజీలు ఉంటుందని వెల్లడించారు. అతడిని కోర్టులో సోమవారం హాజరుపరిచారు. ఎవరైనా అటవీ జంతువులను వేటాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉప ఎన్నికల్లో విజయం...

టిక్కెట్టు దక్కేనా ఈ పర్యాయం..!

- అధికార బీజేడీలో ఊగిసలాట
- ముగ్గురు మహిళా అభ్యర్థుల సీట్లపై సమాలోచనలు
- బంధువులకు సీట్లు కేటాయించే యోచన



అలకా మహంతి
బొర్షా సింగ్ బొరిహా
దీపాలి దాస్

భువనేశ్వర్:

గత సార్వత్రిక ఎన్నికలు 2019 నుంచి వివిధ కారణాల వలన జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు మహిళా అభ్యర్థులకు బిజూ జనతా దళ్ నుంచి ఈసారి టిక్కెట్టు దక్కుతుందో లేదోననే ఉత్కంఠ నెలకొంది. ఈ ముగ్గురు వర్ధమాన పరిస్థితుల్లో తమ భవితవ్యంపై ఊగిసలాడుతున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల టికెట్ల కేటాయింపుపై జరుగుతున్న కసరత్తులో వీళ్లకు అవకాశాలపై ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. ఈ ముగ్గురు బదులుగా వారి బంధువులకు ఈసారి బరిలోకి దించే యోచనతో అధికార పక్షం బిజూ జనతా దళ్ యోచిస్తున్నట్లు సమాచారం. అయితే సంబంధిత నియోజకవర్గాల్లో అలజడి రేగకుండా అధిష్టానం జాగ్రత్త వహిస్తోంది. బిజూ జనతా దళ్ 72 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో కూడిన తొలి జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో బర్‌గడ్ పార్లమెంటరీ స్థానం పరిధిలోని బీజేపూర్, బర్‌గడ్, అట్టాబిరా, భట్లీ అనే 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన 3 స్థానాలు బ్రజరాజ్‌నగర్, పదంపూర్, ఝార్సుగుడ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు.

నవ కిషోర్ హత్యానంతరం

దివంగత మాజీ మంత్రి నవ కిషోర్ దాస్ హత్యానంతరం తండ్రి పరపతితో కూతురు దీపాలి దాస్ బిజూ జనతా దళ్ అభ్యర్థిగా ఝార్సుగుడ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలో పోటీ చేసి ఘన విజయం సాధించింది. తన సమీప ప్రత్యర్థి, బీజేపీకి చెందిన టొంకొధొరా త్రిపాఠిపై 48,000 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించింది. జనవరి 29న ఒక పోలీసు అధికారి నవ కిషోర్ దాస్‌ను హత్య చేయడంతో 2023 మే 10న ఈ నియోజకవర్గంలో ఉపఎన్నిక నిర్వహించారు. అయితే ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో దీపాలి దాస్‌కు టిక్కెట్టు దక్కే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ఈమె బదులుగా సోదరుడు విశాల్ దాస్‌ను బరిలోకి దింపాలని బీజేడీ యోచిస్తున్నట్లు సమాచారం. పశ్చిమ ఒడిశాలో అగ్రస్థాయి రాజకీయ నాయకుడుగా వెలుగొందిన దివంగత మంత్రి నవ కిషోర్ దాస్ కుమారుడు, కుమార్తె ఇరువురు తండ్రి పరపతిని ఉమ్మడిగా సంరక్షిస్తు స్థానిక రాజకీయాల్లో చురుకుగా పాలుపంచుకుంటున్నారు. దీపాలీ దాస్ తన తండ్రితో కలిసి బర్‌గడ్ పార్లమెంటరీ సీటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించింది. ఈ నేపథ్యంలో దీపాలి దాస్‌కు బర్‌గడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బరిలోకి దింపే యోచనని బీజేడీ లోతుగా సమీక్షిస్తుంది. మరోవైపు 2022 సంవత్సరం డిసెంబర్‌లో పదంపూర్ శాసనసభ నియోజకవర్గం ఉపఎన్నికలో బొర్షా సింగ్ బొరిహా సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన ప్రదీప్ పురోహిత్‌పై విజయం సాధించింది. తన తండ్రి బిజయ్ సింగ్ బొరిహా మరణానంతరం పోటీ చేయడంతో సానుభూతి సోపానంగా విజేతగా నిలిచింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తండ్రి సాధించిన విజయం కంటే ఘనమైన ఆధిక్యత 42,679 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నియోజకవర్గంలో కూడా అభ్యర్థిని మార్చి సిట్టింగ్ ఎమ్మెల్యే సోదరుడు భోజరాజ్ సింగ్ బొరిహాను ఈసారి పదంపూర్ స్థానం నుంచి పోటీకి దింపే అవకాశం కనిపిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బ్రజరాజ్ నగర్ నియోజకవర్గం ఉప ఎన్నిక రసవత్తరంగా సాగింది. జూన్ 2022లో జరిగిన ఎన్నికలో బీజేడీ ప్రభంజనం దద్దరిల్లింది. ఈ నియోజకవర్గం ఉప ఎన్నికలో బిజూ జనతా దళ్ దివంగత ఎమ్మెల్యే కిషోర్ మహంతి భార్య అలకా మహంతిని పోటీకి నిలబెట్టింది. కాంగ్రెస్ అభ్యర్థి కిషోర్ చంద్ర పటేల్‌పై ఆమె 65,000 ఓట్ల భారీ తేడాతో గెలుపొంది రికార్డు స్థాయి విజయం సాధించింది. బీజేడీ త్వరలో జరగనున్న ఎన్నికల్లో అలకా మహంతిని మరోసారి బరిలోకి దింపే అంశంపై రాజకీయ శిబిరాల్లో ఊపందుకుంటుంది. ఇంకా ఈ విషయంలో స్పష్టత చోటు చేసుకోలేదు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

పర్లాకిమిడి: గురండి పోలీసుస్టేషన్ పరిధి తోటగుమ్మడలో మార్చి 29వ తేదీన జరిగిన హత్యా కేసును పోలీసులు సోమవారం ఛేదించారు. జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సమక్షంలో మృతుడు ఎం.లింగరాజు భార్య ఎం.జయలక్ష్మి, ఆమె ప్రియుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన్యం జిల్లా బత్తిలి గ్రామానికి చెందిన నెయ్యల ఉపేంద్రను విలేకరుల హాజరుపరిచారు. మృతుడు ఎం.లింగరాజు తమ్ముడు ఎం.పరశురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదర్శపోలీసు స్టేషన్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవనంద నాయక్ ఆదేశాల మేరకు గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో సిబ్బంది దర్యాప్తు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎం.లింగరాజు (28) ఈనెల 28న గుసాని సమితి బట్టిసిరిపురంలో బంధువుల పెళ్లికి వెళ్లాడు. ఈ విషయాన్ని ఆయన భార్య ఎం.జయలక్ష్మీ తన ప్రియుడు నెయ్యల ఉపేంద్రకు ఫోన్‌చేసి చెప్పింది. గత నాలుగేళ్లగా జయలక్ష్మీకి, ఉపేంద్రకు అక్రమ సంబంధం ఉండడంతో అడ్డుగా ఉన్నటువంటి లింగరాజును ఎలాగైనా హత్య చేయాలని పథకం పన్నారు. అనుకున్నట్టుగానే పెళ్లికి వెళ్లిన లింగరాజును నెయ్యల ఉపేంద్ర కలిసి డ్రింక్ తాగుదామని రాత్రి 9.50 గంటలకు తన ద్విచక్ర వాహనంపై తోటగుమ్మడ గ్రామం వైపు తీసుకెళ్లాడు. అనంతరం ఒకచోట లింగరాజును తనతో తెచ్చుకున్న పదునైన స్క్రూ డ్రైవర్‌తో మెడపై పొడిచాడు. దీంతో రోడ్డుపక్క ఎం.లింగరాజు పడిపోగా ఆయన మెడపై, ఛాతిపై 25 సార్లు, పొట్టలో 27 సార్లు పొడిచి అతడి వద్దనున్న బంగారు చైన్, ఉంగరం, సెల్‌ఫోన్ తీసుకుని బత్తిలి గ్రామం వైపు పారిపోయాడు. తీవ్రగాయాలతో ఎం.లింగరాజు సంఘటన స్థలంలో ఎవ్వరూ లేకపోవడం వల్ల పొలాల్లో పడి చనిపోయాడు. దీంతో దర్యాప్తు చేసి నిందితులను ఆదివారం అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించారు. నిందితుడు నుంచి బైక్, బంగారు చైన్, రింగు, మూడు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

అనాథ యువకుడికి పెళ్లి



సాంప్రదాయ నృత్యాలతో మహిళలు

- జంటను ఒక్కటి చేసిన గ్రామస్తులు



వివాహం చేసుకున్న నరేష్

రాయగడ: ఊరంతా ఒక్కటై అనాథ యువకుడికి వివాహం జరిపించిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సునాఖండి పంచాయతీలోని బరియాపాడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నరేష్ కద్రకను చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిచి వెళ్లిపోయారు. దీంతో అతడు అనాథగా మారాడు. అయితే అందరితో కలిసిమెలిసి ఉంటూ అదే గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ పాడుబడిన ఇంట్లో నివసిస్తుండేవాడు. గ్రామస్తులంతా నరేష్‌ను ఆప్యాయంగా చూసుకునేవారు. ఈ క్రమంలో యుక్త వయస్సు రావడంతో గ్రామస్తులంతా ఏకమై ఒక మంచి యువతిని చూసి ఆదివాసీ సాంప్రదాయ పద్ధతిలో వివాహం జరిపించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం చోటుచేసుకుంది. అయితే ప్రస్తుతం నరేష్ ఉంటున్న ఇళ్లు పూర్తిగా పాడుబడడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆవాస్ యోజన పథకంలో నరేష్‌కు ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గొడుగులు వితరణ



గొడుగులు వితరణ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

బరంపురం: నగరంలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గడిచిన వారం రోజులుగా నగరంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడి ప్రతాపం మొదలవుతోంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డుపై నివసించే అభాగ్యులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులను సోమవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వెంకటరావు, ప్రాజెక్టు చైర్మన్ ఎ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భారీగా గంజాయి స్వాధీనం



రాయగడ: గంజాయిని పట్టుకున్న పోలీసులు

మల్కన్‌గిరి: గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఒక వ్యక్తిని బలిమెల పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ పోలీసుస్టేషన్ పరిధి పండియాగూడ గ్రామ సమీప అడవి నుంచి గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో బలిమెల ఎక్సైజ్ అధికారి రవీంద్ర కుమార్ ప్రధాన్ తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్కడ ఒక వ్యక్తి గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గ్రహించి అతడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి గోపీ పంగి(50)గా పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా 116 కేజీలు ఉంది, దాని విలువ రూ.15 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

రాయగడ: జిల్లాలోని గుడారిలో 68 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గుడారి పోలీసుస్టేషన్ పరిధి గుమ్మి గ్రామంలో నివసిస్తున్న మంగళ సాంబ్రుతిక అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా మూడు సంచుల్లో గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుని అరెస్టు చేసి కోర్టుకు సోమవారం తరలించారు.



మల్కన్‌గిరి: స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఉత్సాహంగా చెస్ పోటీలు







స్థానిక గాంధీ కూడలి సమీపంలోని ఉమా మహేశ్వర్ కాంప్లెక్స్‌లో జయపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు సోమవారం ప్రారంభించారు. టోర్నమెంట్‌లో కటక్, ఖుర్ధ, కేంద్రాపడ, జగత్‌సింగపూర్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, అణుగుల్, కలహండి, బాలాసోర్, కొరాపుట్ జిల్లాల నుంచి 108 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జయపురం చెస్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఆర్.సుభాష్ చంద్రరావు వెల్లడించారు. పోటీల్లో చిన్నారులతో పాటు అన్ని వయస్సుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కొరాపుట్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ మహంతి పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతగా భబేష్ మహంతి వ్యవహరించారు.

– జయపురం

క్లుప్తంగా

ఇన్‌చార్జి జనరల్ మేనేజర్‌గా మొహేష్



మొహేష్ కుమార్ బెహెరా

భువనేశ్వర్: భారతీయ రైల్వే ఇంజినీరు సేవా విభాగం (ఐఆర్‌ఈఎస్) అధికారి మొహేష్‌కుమార్ బెహెరా తూర్పు కోస్తా రైల్వే (ఈకోర్) ఇన్‌చార్జి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఈయన పలు కీలక శాఖల్లో బాధ్యతలు నిర్వహించారు. తూర్పు కోస్తా రైల్వేలో చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్, చీఫ్ ఇంజినీర్ (బ్రిడ్జ్ రిహాబిలిటేషన్) వంటి ఉన్నత హోదాల్లో కీలక బాధ్యతలను నిర్వహించారు. భువనేశ్వర్‌లోని రైట్స్‌లో గ్రూప్ జనరల్ మేనేజర్‌గా, పాట్నా మరియు ముంగేర్ వద్ద తూర్పు మధ్య రైల్వే చీఫ్ ఇంజినీర్ (నిర్మాణం)గా, గంగా బ్రిడ్జ్ ప్రాజెక్ట్ పర్యవేక్షకునిగా విశేష గుర్తింపు సాధించారు. సంబల్‌పూర్ రైల్వే మండలంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో–ఆర్డినేషన్), తూర్పు కోస్తా రైల్వే డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, ఉత్తర సరిహద్దు (ఎన్‌ఎఫ్) రైల్వేలో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ (నిర్మాణం) వంటి కీలకమైన పోస్టుల్లో పని చేశారు.

పింఛన్ల పంపిణీకి ప్రణాళిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: పింఛన్ల పంపిణీకి ప్రణాళిక రూపొందిస్తున్నామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. జిల్లాలో 732 సచివాలయాల ద్వారా ఒక్కొక్క సచివాలయానికి సగటున 456 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చెరువుల మరమ్మతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీ నవీన్, డీఆర్‌వో ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు బ్యాంకు పీఓ కొలువు



జ్యోత్స్నకు స్వీట్ తినిపిస్తున్న తండ్రి ఢిల్లీరావు

కంచిలి: మండలంలోని మకరాంపురం పంచాయతీ సాలినపుట్టుగ గ్రామానికి చెందిన పేదింటి బిడ్డ సాలిన జ్యోత్స్న ఐబీపీఎస్ ఫలితాల్లో సత్తాచాటి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో పీఓగా ఎంపికైంది. ఈమె తండ్రి ఢిల్లీరావు రైతు. తల్లి శేషమ్మ అంగన్‌వాడీ కార్యకర్త. సోదరుడు రాజీవ్ బీటెక్ చదువుతున్నాడు. జ్యోత్స్న బీటెక్ పూర్తి చేశాక పోటీపరీక్షలకు సిద్ధమైంది. ఐబీపీఎస్ రాసి పీఓ కొలువుకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

ఆమదాలవలస రూరల్: మండలంలోని దన్నానపేట సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నుంచి 2027 వరకు ఈ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌బీఏ బృందం కళాశాలను పరిశీలించినట్లు తెలిపారు. కళాశాల ప్రగతి, సాధించిన ఫలితాలు, వసతులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి చెందిన బృందం అక్రిడిటేషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ఎస్‌బీటిఈటీ చైర్మన్ నాగమణి, సెక్రటరీ కె.వి.రమణబాబు, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, జాయింట్ సెక్రటరీ జానకిరామ్, కళాశాల మెకానికల్ విభాగం అధిపతి ఎ.గోపి, ఈసీఈ విభాగ అధిపతి పి.శ్రీనివాస్, అధ్యాపకులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఖగేశ్

మందస: మండలంలోని హరిపురం శివారులో బిన్నళమదనాపురం రహదారి వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. హరిపురం గ్రామానికి చెందిన రైస్‌మిల్లు యజమాని నల్ల రామారావు మిల్లులో పనులు ముగించుకుని, ఇంటికి స్కూటీలో బయలుదేరారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన వై.మహేశ్, ఖగేశ్, జీవన్ ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తుండగా.. రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామారావు, ఖగేశ్‌ల కాళ్లు విరిగిపోగా, మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. రామారావును మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. మరో ద్విచక్ర వాహంనలో ప్రయాణిస్తున్న ముగ్గురిని పలాస సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భువనేశ్వర్: విద్యుత్ వెలుగుల్లో రాష్ట్ర శాసనసభ



భువనేశ్వర్: ఖారవేళ భవన్



భువనేశ్వర్: జంట నగరాల పోలీసు కమిషనరేట్ ప్రధాన కార్యాలయం

వేడుకగా ఉత్కళ దివాస్

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అన్ని ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు ప్రత్యేక విద్యుద్దీప అలంకరణలతో కళకళలాడాయి. అన్నిచోట్ల సామూహికంగా రాష్ట్ర గీతాలాపన చేశారు. రాష్ట్రం కోసం కృషి చేసిన మహనీయులకు నివాళులర్పించారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: పాత బస్టాండ్ వద్ద కృష్ణచంద్ర గజపతికి పూలమాల వేస్తున్న కలెక్టర్ స్మృతి రంజాన్ ప్రధాన్



భువనేశ్వర్: రాష్ట్ర నిర్మాతల ఛాయా చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు



భువనేశ్వర్: సామూహిక రాష్ట్ర గీతాలాపనలో సీఈఓ నికుంజ బిహారి ధొలో తదితరులు



రాయగడ: గజపతి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహాజన్ తదితరులు



మల్కన్‌గిరి: మహనీయుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న అధికారులు



కొరాపుట్: నివాళులర్పిస్తున్న నబరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్ మిశ్ర తదితరులు



కొరాపుట్: ప్రముఖుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కొరాపుట్ కలెక్టర్ కీర్తివాసన్



కొరాపుట్: కొరియాలో ఉత్కళ దినోత్సవ వేడుకలు



మల్కన్‌గిరి: గోపబంధ్ దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పవార్ సచిన్ ప్రకాష్



జయపురం: సమావేశంలో మాట్లాడుతున్న మదన్ మోహన్ నాయక్



పర్లాకిమిడి: శ్రీకృష్ణచంద్ర గజపతి మహారాజా స్మృతి వనంలో అంజలి ఘటిస్తున్న అధికారులు



జయపురం: దివంగత ఎమ్మెల్యే లైచన్ నాయక్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు



పర్లాకిమిడి: వందే ఉత్కళ జననీ గీతం పాడుతూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



భువనేశ్వర్: అకౌంటెంట్ జనరల్ కార్యాలయం



పర్లాకిమిడి: మాట్లాడుతున్న ఏడీఎం బీరేంద్రకుమార్ దాస్

విద్యార్థుల ప్రవర్తన గమనించాలి



విద్యాసంస్థల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : కళాశాలలు, పాఠశాలలు, వసతి గృహాలకు వెళ్లే విద్యార్థుల ప్రవర్తనను సీసీ టీవీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థుల భద్రత, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కళాశాల లైబ్రరీలు, తరగతి గదులు, కారిడార్స్, స్టాఫ్ రూమ్‌లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినులను కౌన్సిలింగ్ నెపంతో తరచుగా పిలుస్తుంటే యాజమాన్యం దృష్టిపెట్టాలన్నారు. నియామకాలు చేసేటప్పుడు నేరప్రవృత్తి, పూర్వాపరాలన్నీ పరిశీలన చేయాలని, అమ్మాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చినప్పుడు మహిళా సిబ్బంది కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్ వంటి ల్యాబ్‌లలో ప్రాక్టికల్‌వర్క్ నేర్చుకోవడానికి విద్యార్థినులు వెళ్లేటప్పుడు మహిళా సిబ్బంది ఉండాలన్నారు. శారీరక దండన, కార్పొరేట్ కల్చర్ ఎడ్యుకేషన్, పిల్లలందరి ముందు అవహేళన చేయడం వంటివి చేయకూడదని, ర్యాగింగ్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుని పిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. వసతిగృహాల్లో వార్డెన్లు తప్పనిసరిగా ఉండాలని, సిబ్బంది, విద్యార్థులు టెర్రస్ పైకి వెళ్లకుండా తాళాలు వేసుకోవాలని, బాలికల వసతిగృహాలకు మహిళా వార్డెన్ ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తే కుటుంబసభ్యులతో మాట్లాడాలన్నారు. క్యాంపస్ కాప్స్, చిన్నారికి చేదోడు కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఐవో పి.దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన కల్పించి నిత్యం యోగా, ధ్యానం చేయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.విజయ్‌కుమార్, సీఐలు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, ఎస్ఐలు, కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ను సస్పెండ్ చేసిన వైఎస్సార్‌సీపీ

వజ్రపుకొత్తూరు: పూండి–గోవిందపురం ఉప సర్పంచ్ గుంట సత్యంపై వైఎస్సార్‌సీపీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలిన పాలిన ఉమామహేశ్వరావు, సర్పంచ్ పాలిన రమ్య ప్రకటన విడుదల చేశారు. పార్టీలో ఎంతో ప్రాధాన్యమిచ్చినప్పటికీ ఇటీవల సత్యం వ్యవహార శైలి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో సీతంపేట గ్రామస్తుల కోరిక మేరకు వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

వీరగున్నమ్మ కీర్తి.. భావి తరానికి స్ఫూర్తి



వీరగున్నమ్మ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మందస: తెల్లదొరలపై కత్తులు దూసిన వీరగున్నమ్మ కీర్తిని భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మందస మండలంలోని గుడారిరాజమణిపురం(వీరగున్నమ్మపురం) గ్రామానికి చెందిన వీరనారి సాసుమాన గున్నమ్మ 84వ వర్ధంతి వీరగున్నమ్మపురం సమీపంలో గున్నమ్మ స్థూపం, మందసలలో సోమవారం నిర్వహించారు. మందసలోని శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ నాయకుడు కొర్ల హేమారావుచౌదరి, సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, ఆర్.దిలీప్‌కుమార్, అప్పలస్వామి, కృష్ణ, వల్లభ, చిరంజీవి, మట్ట ధర్మారావు, సవర గురునాథ్, కె.కేశవరావు, పి.దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కానిస్టేబుల్‌ను దూషించడం సరికాదు

మందస: మండలంలోని బుడారిసింగి పంచాయతీ కళింగదళ్ వద్ద జరిగిన సంఘటనలో ఎస్టీ కానిస్టేబుల్ రవికుమార్‌పై అనుచిత ప్రవర్తన సరికాదని గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు సవర నీలకంఠం అన్నారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి సోమవారం మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాటుసారా అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లారని, వారిని చూసి పారిపోతున్న దేవరాజు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో గాయపడ్డారని చెప్పారు. విషయం తెలుసుకోకుండా టీడీపీ నాయకులు కానిస్టేబుల్‌ను కులం పేరుతో నిందించడం అన్యాయమన్నారు. దూషించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మందస మండలంలోని పెడంగో వద్ద జరిగిన సంఘటనలో పోలీసుల ప్రమేయం ఉందో లేదో తెలుసుకోకుండా శిరీషా భూతద్దంలో చూపిస్తున్నారని జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, గిరిజన నాయకులు సవర నీలకంఠం, డొంబురు, చిరంజీవి, కామేషు, సవర ఢిల్లీరావు, బాబురావు, మజ్జి కుమారచంద్ర, నగేశ్, భావన్న, భైరాగి, సవర ఆనంద్, లోకేష్, పెద్ద డొంబురు, పూర్ణ, కూర్మారావు, ఏలియా, సీమోన్, రాము తదితరులు ఆరోపించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తున్న ఎస్టీ, ఎస్సీ ఉద్యోగులను నైతికంగా, మానసికంగా దెబ్బ తీస్తున్నారన్నారు. దేవరాజు, పోలీసులకు మధ్య గొడవ జరిగిందనడం వాస్తవం కాదన్నారు. మందస పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



బెల్టులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా బోధిధర్మ యుద్ధ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లకు జిల్లా నలుమూలలు నుంచి 200 మంది హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా బెల్టులు ప్రదానం చేశారు. 65 మందికి వైట్ బెల్టులు, 80 మందికి ఎల్లో బెల్టులు, 50 మందికి ఆరెంజ్ బెల్టులు, 10 మందికి గ్రీన్ బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి, యుద్ధకళ క్షేత్రం వ్యవస్థాపకులు రేగిడి దయమయ, విద్యార్థి భవన్ డైరెక్టర్ ఆరంగి గోవిందబాబు, ముఖ్య శిక్షకులు ఎం.వెంకటరావు, నక్క లక్ష్మణ్‌నాయుడు, బి.ఈశ్వర్, గౌతమి శివరాం, యస్వంత్, ఢిల్లీశ్వర్, రమణ, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం

శాంతి భద్రతలను కాపాడడంతో పాటు ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలిచేందుకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసుల సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 89వ పోలీసు వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మరణించిన అమరులకు నివాళులర్పించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసులను సన్మానించారు. కార్యక్రమాల్లో పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మల్కన్‌గిరి: ప్రసంగిస్తున్న ఎస్పీ నితీష్ వాధ్వానీ



పర్లాకిమిడి: ఉత్తమ అవార్డులు అందజేస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు



భువనేశ్వర్: డిస్క్ విజేతలతో డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు



భువనేశ్వర్: గౌరవ వందనం స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అవినాష్ కుమార్



రాయగడ: గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ హరీష్



బరంపురం: గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సార్వణ్ వివేక్

క్లుప్తంగా

కోనేరులో యువకుడి గల్లంతు


కోనేరులో గాలిస్తున్న సిబ్బంది


గల్లంతైన ప్రభాస్

పాలకొండ: పట్టణంలోని వెంకటరాయుని కోనేరులో సోమవారం మధ్యాహ్నం ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కస్పావీధికి చెందిన మింది లక్ష్మణరావు, మణి దంపతుల చిన్నకుమారుడు ప్రభాస్(19) స్నానం కోసం కోనేరులో దిగి ప్రమాదవశాత్తు కాలు జారి మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలింపు చేపట్టారు. కోనేరులో లోతుతో పాటు నీరు ఎక్కువగా ఉండడంతో రాత్రి వరకు మృతదేహం దొరకలేదు.

రిజర్వాయర్‌లో మత్స్యకారుడి మృతి


మృతుడు దేముడు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో పడిపోయి మత్స్యకారులు కె.దేముడు (54) మృతిచెందినట్లు ఎస్సై వై.వి.జనార్దన్ సోమవారం తెలిపారు. ఈ ప్రమాదంపై ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీన గ్రామానికి చెందిన తోరిక సూరన్నదొరతో కలిసి చేపల వేట చేసిన అనంతరం పడవపై మడ్డువలస రేవు వైపు వెళ్లి వేట చేసిన చేపలు విక్రయించి పటువర్ధనం రేవుకు తిరిగి వచ్చారు. కొద్దిసేపటి తరువాత తిరిగి చేపల వేట చేసేందుకు వెళ్లిన రిజర్వాయర్‌లోకి వెళ్లిన దేముడు ఆచూకీ తెలియలేదని ఆయన భార్య నూకమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రాజెక్టు పరిసరాల్లో గాలించడంతో పటువర్ధనం రేవు వద్ద దేముడు మృతదేహాన్ని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. మృతుడి స్వగ్రామం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని రైవాడ గ్రామం. బతుకుతెరువు కోసం 20 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

3,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊట నిల్వల వద్ద ఎస్ఈబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక ఎస్ఈబీ, విజయనగరం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సంయుక్తంగా జరిపిన దాడుల్లో బొబ్బిలి మండలంలోని కొయ్యకొండ వలసలో 3,200 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. సోమవారం జరిపిన ఈ దాడుల్లో ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధర్,ఎస్సైలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

11 కిలోల గంజాయి పట్టివేత

భామిని: మండలంలోని బత్తిలి సమీపంలోని ఆంధ్ర–ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 11 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 11 కిలోల గంజాయితో పాటు, ఇద్దరు కేరళ వాసులను పట్టుకుని అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ తెలిపారు. పట్టుకున్న ఇద్దరు నిందితుల్లో ఒకరు మగ, ఒకరు ఆడ వ్యక్తి ఉన్నారని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ రెబల్ అభ్యర్థిగా గీత..?

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీసీ నేత మీసాల గీతకు తెలుగుదేశం పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో రెబల్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పర్యటించి తన అనుచరులను కలిసి మద్దతు కోరారు. బీసీ వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్ దక్కకుండా స్థానిక నేత చేసిన అన్యాయం ప్రజలకు వివరించారు. ఆఖరి నిమిషం వరకు తనకు ఎంపీ టిక్కెట్ ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా పార్టీ మోసం చేసిందన్నారు. అనుచరుల ఒత్తిడి మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పారు. మండలంలోని కోరుకొండ, కార్పొరేషన్ పరిధిలోని శాంతినగర్, బాబామెట్ట, ప్రదీప్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఆమె ప్రచారం సాగింది.

ఉన్న ఊరిలోనే ‘ఉపాధి’

- 2.10 కోట్ల పనిదినాల లక్ష్యం
- 2.18 కోట్ల పనిదినాల కల్పన
- 65,441 మందికి 100 రోజుల పనిదినాలు



చీపురుపల్లి మండలం కర్లాంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులకు అధిక సంఖ్యలో ప్రభుత్వం వారు ఉన్న ఊరిలోనే పని కల్పించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి వేతనదారులకు పనికల్పించారు. అదే విధంగా 100 పనిదినాలు కూడా వేలాది మంది వేతనదారులకు అందాయి. పల్లెకు పండగ వచ్చిందన్న మాదిరి పల్లెలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. ఉదయం 6 గంటలకల్లా గ్రామాల్లో ఉన్న వేతనదారులంతా పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు. సొంత గ్రామంలోనే పనిదొరకడంతో వేతనదారులు ఆసక్తి చూపుతున్నారు. వేతనదారులకు కనీస వేతనం వచ్చే విధంగా చేయడం కోసం రెండు పూటలా పని కల్పిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో 3.45 లక్షల జాబ్ కార్డులు, 6,11,286మంది వేతనదారులు ఉన్నారు. వారంతా ఉపాధి హామీ పనులకు వెళ్తారు. ఈ ఏడాది వేతనదారులకు ప్రభుత్వం లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి 2.10 కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించాల్సి ఉండగా 2.18 కోట్ల పనిదినాలు కల్పించింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం వేతనదారులకు ఇచ్చే వేతనాన్ని రూ.270 నుంచి రూ.300కు పెంచింది. దీంతో ఈ ఏడాది వేతనదారులు మరింత ఎక్కువ సంఖ్యలో పనికి వచ్చే అవకాశం ఉంది.

65,441 మంది వేతనదారులకు పనికల్పన

ఉపాధిహామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కల్గిన కుటుంబానికి 100 రోజులు పనికల్పించాలన్నది లక్ష్యం. 100 రోజులు పనికల్పించడం ద్వారా వచ్చే వేతనం ద్వారా కుటుంబ పోషణను వేతనదారులు చేసుకుంటున్నారు. ప్రతి కుటుంబానికి రూ.20 వేల రూ. 25 వేల వరకు వస్తుంది.

ఊరిలోనే పని బాగుంది



ప్రతి ఏటా చెరువు పనికి వెళ్లాను. ప్రతి ఏడాది పనికి వెళ్లడం ద్వారా మా కుటుంబానికి రూ.20 వేల వరకు వస్తుంది. ఈ పథకం రాకముందు ఇతర ప్రాంతాలకు పనికి వెళ్లేవారం. ఇప్పుడు ఉన్న ఊరిలోనే పని దొరుకుతోంది.
– బెల్లాన రామ్మూర్తి, వేతనదారు, బొబ్బిలి మండలం

ఎక్కువగా పనికి వస్తారు



మా గ్రామంలో ప్రతి రోజూ ఎక్కువ మంది వేతనదారులు పనికి వస్తున్నారు. ఎండ వల్ల ఉదయం 6 గంటలకే పని పెడుతున్నారు. వేతనం కూడా గిట్టుబాటు అవుతోంది. వారానికి రూ.1300 నుంచి రూ.1500 వరకు వస్తుంది.
– బి.రాముడమ్మ, వేతనదారు, కర్లాం గ్రామం, చీపురుపల్లి మండలం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కర్రి నాగరాజు, తాడివాడ అప్పన్న, నిమ్మ వెంకటరమణ, విసినిగిరి పాపారావు, రాగోలు సన్యాసి, కర్రి చిన్న తదితరులు ఉన్నారు. వారందరికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల కంటే గ్రామంలో ఎక్కువ మెజారిటీ తీసుకురావాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థపై కక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- కూటమి నాయకుల శాడిజం
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు వారధిలా ఉన్న వలంటీర్లపై కక్ష పెంచుకున్న చంద్రబాబు నాయుడు, ఆయన కూటమి నాయకులు మాజీ ఎన్నికల అధికారిని అడ్డం పెట్టుకుని ఈసీకి ఫిర్యాదు చేసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు టీడీపీ హయాంలోని ఇబ్బందులనే మళ్లీ తీసుకొచ్చే కుయుక్తులు పన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెన్షన్లు అందుకుంటున్న వృద్ధులకు అవస్థలుంటాయనే ఆలోచన కూడా చేయకుండా మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదును పరిశీలించిన ఈసీ కూడా వలంటీర్ల సేవలను నిలిపివేసిందని మండిపడ్డారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు తెల్లవారగానే 5నుంచి 6 గంటలకు పింఛన్లు ఇచ్చే పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చారని, ఈ పరిస్థితిని తట్టుకోలేని కూటమి పక్షాలు ఇలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఈ పరిస్థితులు చూసిన వలంటీర్లు కూడా తాము రాజీనామా చేసి సేవలను కొనసాగిస్తామనే నిర్ణయానికి రావడం చూస్తే కూటమి కుయుక్తులు ప్రజల్లో ఎంతగా నాటుకున్నాయో అర్థమవుతుందన్నారు. వలంటీర్లపై ప్రతిపక్షానికి ఎంత కసి ఉందో మేమూ అంతే కసిగా పనిచేస్తామని వలంటీర్లే స్వయంగా చెబుతున్నారన్నారు. పింఛనుదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్ అందుకోవాలంటే కష్టంతో కూడుకున్నదైనప్పటికీ ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించక తప్పదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదర రావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

- ప్రథమ స్థానం సాధించిన ఏపీ జట్టు
- జట్టులో కీలకంగా మారిన జిల్లా క్రీడాకారులు


జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు

తెర్లాం: జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు అత్యుత్తమ ఆటతీరును కనబరిచి జాతీయస్థాయిలో ఏపీ జట్టు ప్రథమస్థానం సాధించేలా సత్తా చాటారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో 36వ జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీలకు రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించిన జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఫైనల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడానికి కృషి చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుల్లో జ్యోతిప్రకాశ్(జెడ్పీహెచ్ఎస్–ఆరికతోట), జనార్దనసాయి (పీఎస్.బొడ్డవలస), రోహిత్, నాని (జెడ్పీహెచ్ఎస్, పారాది) ఉన్నారు. జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిన జిల్లా క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు అభినందించారు.

దగ్ధమైన సరుగుడు, శ్రీగంధం తోటలు


ప్రమాదంలో కాలిపోతున్న సరుగుడు, శ్రీగంధం వృక్షాలు

వేపాడ: మండలంలోని శింగరాయి రెవెన్యూలో గల ఏఎస్ఆర్ లే అవుట్‌లో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సరుగుడు, శ్రీ గంధం, జామ, కొబ్బరి తదితర వృక్షాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్.కోట అగ్నిమాపకాధికారి మదీనాతో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అలాగే వేపాడ శివారు బక్కునాయుడుపేటలో గ్రామానికి చెందిన చెలుబోను దేముడుకు సంబంధించిన పశువుల పాక దగ్ధమైంది. పాక కాలిపోతుండగా వెదురుపేలుళ్ల శబ్దానికి గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పశువులను కాపాడగలిగారు. అయితే పశువుల పాక, పక్కనే ఉన్న గడ్డివాము పూర్తిగా ఆహుతైంది.

హత్య కేసు ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గురండి పోలీస్‌స్టేషన్ పరిధి తోటగుమ్మడలో మార్చి 29వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు సోమవారం ఛేదించారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సమక్షంలో హతుడు ఎం.లింగరాజు భార్య ఎం.జయలక్ష్మి, ఆమె ప్రియుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా బత్తిలి గ్రామానికి చెందిన నెయ్యల ఉపేంద్రను విలేకరుల ఎదుట హాజరుపరిచారు. హతుడు లింగరాజు తమ్ముడు ఎం.పరశురాం ఫిర్యాదు మేరకు ఆదర్శపోలీసు స్టేషన్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవనంద నాయక్ ఆదేశాలతో గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో సిబ్బంది దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో ఎం.లింగరాజు (28) ఈనెల 28న గుసాని సమితి బట్టిసిరిపురంలో బంధువుల పెళ్లికి వెళ్లినట్లు తెలిసింది. భర్త పెళ్లికి వెళ్లిన విషయాన్ని భార్య జయలక్ష్మి ప్రియుడు నెయ్యల ఉపేంద్రకు ఫోన్‌చేసి చెప్పింది. నాలుగేళ్లుగా జయలక్ష్మి, ఉపేంద్రల మధ్య వివాహేతర సంబంధం ఉండడంతో అడ్డుగా ఉన్న లింగరాజును ఎలాగైనా హత్య చేయాలని ఇద్దరూ పథకం పన్నారు. అనుకున్నట్టుగానే పెళ్లికి వెళ్లిన లింగరాజును ప్రియుడు ఉపేంద్ర కలిసి డ్రింక్ తాగుదామని రాత్రి 9.50 గంటలకు ద్విచక్ర వాహనంపై తోటగుమ్మడ గ్రామం వైపు తీసుకెళ్లాడు. అనంతరం ఒకచోట తనతో తెచ్చుకున్న పదునైన స్క్రూ డ్రైవర్‌తో లింగరాజు మెడపై ఉపేంద్ర పొడిచాడు. దీంతో రోడ్డుపక్క ఎం.లింగరాజు పడిపోగా మెడ, ఛాతీపై 25 సార్లు, పొట్టలో 27 సార్లు పొడిచి హతుడి దగ్గరున్న బంగారు చైన్, ఉంగరం, సెల్‌ఫోన్ తీసుకుని బత్తిలి గ్రామం వైపు పారిపోయాడు. తీవ్రగాయాలతో ఎం.లింగరాజు సంఘటన స్థలంలో చనిపోయాడు. దర్యాప్తులో ఈ వివరాలను పోలీసులు గుర్తించి నిందితులను ఆదివారం అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించారు. నిందితుడి దగ్గరనుంచి బైక్, బంగారు చైన్, రింగు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మినహాయింపు ఇవ్వాలి..

విజయనగరం అర్బన్: దీర్ఘకాలిక వ్యాధులున్న ఉపాధ్యాయులకు పదో తరగతి పరీక్షపత్రాల మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఈఓ ఎన్. ప్రేమకుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మూల్యాంకన రెమ్యూనిరేషన్ వివరాలు, ఏపీజీఎల్ఐకి సంబంధించిన వివరాలతో కూడి న కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మురళి, ఎంపీస్వామి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పి.రాంబాబు, జి.రవి, జిల్లా కార్యదర్శులు బంగారయ్య, వాసుదేవ్, మండల కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై దృష్టి


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌రావు

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గర్భిణులు, బాలింతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన ఆహార నియమాలు , వైద్య పరీక్షలు తదితర అంశాలపై కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిన దానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణిగా ఉన్న సమయంలో స్థానిక ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలు నమోదు చేసుకునేటప్పుడు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాల నివృత్తి చేసే విధంగా వాయిస్ కాల్ సందేశం ఉంటుందని చెప్పారు. మహిళ గర్భం దాల్చిన నాలుగవ నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు నిమిషం 30 సెకెన్లు కావున ప్రతి గర్భిణి పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని చెప్పారు. ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే , ఐవీఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒక రోజులో 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆసందేశాలను వినాలనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి, ఎస్ఓ ధర్మారావు, డీపీఓ జి.ఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యలనగరంలోని మట్టిని నేను...

- పైడితల్లి ఆశీస్సులే ఇంతవరకు తెచ్చాయి..
- గాన కోకిల సుశీలమ్మ
- ఆమెకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం
- మణిశర్మ, కుశపాత్రధారి సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సత్కారాలు
- అలరించిన సినీ సంగీత విభావరి
- వేడుకగా గురునారాయణ కళాపీఠం తృతీయవార్షికోత్సవం


పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న సుశీల


సుశీలకు పూల కిరీటాన్ని అలంకరించి సత్కరిస్తున్న సంగీత దర్శకుడు మణిశర్మ, లవకుశలో నటుడు సుబ్రహ్మణ్యం, సంస్థ సభ్యులు

విజయనగరం టౌన్: విద్యలనగరంలోని మట్టిని నేను.. నేనో ప్రత్యేక మట్టిని.. పైడితల్లి ఆశీస్సులే తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయని గానకోకిల పి.సుశీల పేర్కొన్నారు. రెండు రోజుల కిందట పడిపోయానని, అయినా, ఆ తల్లి ఇక్కడవరకూ తీసుకువచ్చిందన్నారు. విజయనగరంలోని పుట్టి.. సంగీత రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన గాన కోకిల, పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీలమ్మను విజయనగర వాసులు ఘనంగా సత్కరించారు. శ్రీ గురునారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆనందగజపతి కళాక్షేత్రంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. దుశ్శాలువ, జ్ఞాపికలను అందజేసి ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ప్రఖ్యాత సినీసంగీత దర్శకుడు మణిశర్మ, లవకుశ చిత్రంలో కుశుడు పాత్రధారి వియ్యూరి సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా విజయనగర వాసులనుద్దేశించి సుశీలమ్మ మాట్లాడుతూ తను పుట్టిన గడ్డపైనే ఆ దేవుడు ఘంటసాలను తీసుకువచ్చి, తనను సృష్టించి మర్చిపోలేనటువంటి ఖ్యాతిని విజయనగరానికి తెప్పించాడన్నారు. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, డి.కె.పట్టమ్మాల్ వంటి పెద్దల ఆశీస్సులు పొందానన్నారు. సంగీతంలో రాణించడంతో తన తండ్రికి ఆత్మ తృప్తి కలిగిందని తెలిపారు. మణిశర్మ తండ్రి శర్మ గాయత్రీ మంత్రం పాడించి, అర్థాలు చెప్పమనేవారని, తనచేత పాడించేవారని గుర్తుచేశారు. మణిశర్మ కాదయ్యా... శాస్త్రి గారు ఇచ్చిన మణి అని పేర్కొన్నారు. చాలా సంతోషంగా ఉందని, ఇదంతా గురునారాయణ కళాపీఠం నారాయణకే చెల్లిందన్నారు. ఈ గడ్డపై ఎవరు పుట్టినాసరే ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ రాగాలు తీస్తూ.. గొంతు బాగుందా అంటూ అందరినీ ఆశ్చర్యపరిచారు. మనసెరిగినవాడు మా దేవుడు.. శ్రీరాముడు... అంటూ భక్తి గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఎంతోమందికి సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతం పట్ల మరింత ప్రేమ పెరిగేలా గురునారాయణ కళాపీఠం వివిధ కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. గురజాడ, ద్వారం, ఆదిభట్ల , సుశీలమ్మ నడయాడిన పుణ్యభూమి అని చెప్పుకుంటాం.. మా కళ్లముందు సుశీలమ్మను పక్కనే చూడడం మా పూర్వజన్మసుకృతమని తెలిపారు. సుశీలమ్మ విజయనగర వాసి కావడం మనందరి అదృష్టమన్నారు. కళాపీఠం వ్యవస్థాపకుడు బి.ఎ.నారాయణ నేతృత్వంలో పవన్ చరణ్, సురభి శ్రావణి, సంతోష్ కిరణ్, బేబీలావణ్య లతి, హారిక, డాక్టర్ జి.సన్యాసమ్మ, వై.వి.సత్యనారాయణ పాడిన ఆపాత మధురాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి నడిపేన శ్రీనివాసరావు, కోశాధికారి బి.పద్మావతి, గౌరవాధ్యక్షుడు డోల మన్మథకుమార్, జి.సాంబశివరావు, బి.ఎ.రాజారావు, మేకా కాశీవిశ్వేశ్వరుడు, వై.వి.వి.సత్యనారాయణ (అబ్బులు), అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో రాజాం విద్యార్థి సత్తా

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థి జి.అభిరామ్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు పీడీ సీహెచ్ కేశవనారాయణ సోమవారం తెలిపారు. గత నెల 30, 31 ఎన్టీఆర్ జిల్లా చిలకల్లులో ఈ పోటీలు జరిగాయన్నారు. 63, 67 కేజీల విభాగంలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమ్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

మూల్యాంకన ప్రక్రియ ప్రారంభం

- తొలిరోజు 12,533 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి

విజయనగరం అర్బన్: పదోతరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ స్థానిక సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో సోమవారం ప్రారంభమైంది. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,70,162 జవాబు పత్రాల మూల్యాంకనకు 936 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించారు. తొలి రోజున 12,533 జవాబుపత్రాల మూల్యాంకన పూర్తియింది. అత్యధికంగా సోషల్, ఫిజిక్స్ రెండు వేలు దాటి పూర్తి చేశారు.